'కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ ఆలయాలపై దాడులు'



నిరసన వ్యక్తం చేస్తున్న సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి ప్రతినిధులు

జియాగూడ: కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర చైర్మన్ పుట్టి యాదగిరి, అధ్యక్షుడు యమన్‌సింగ్, కోశాధికారి సీహెచ్. బాబురావు ఆరోపించారు. ఈ మేరకు శనివారం సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి అంబర్‌పేట్, జియాగూడ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ..సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను పట్టుకొని దాని వెనుక ఉన్న కుట్రను ప్రభుత్వం ఛేదించాలని పేర్కొన్నారు. అలాగే ముత్యాలమ్మ ఆలయం వద్ద నిరసనలు చేస్తున్న హిందూవులపై పోలీసులు దాడి చేయడం తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో నగర కన్వీనర్ రాంచందర్ ముదిరాజ్, రాష్ట్ర సహా కార్యదర్శి సదానంద్, జికె.రాయుడు, కార్వాన్ అధ్యక్షులు చంద్రశేఖర్, కృష్ణగౌడ్, దశరథ్, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షేక్‌పేట్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



షేక్‌పేట్ వివేకానంద నగర్‌లో కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: అభివృద్ధి పనులకు విరివిగా నిధులు కేటాయించడమే తమ లక్ష్యమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లోని ఆలీజాపూర్, వివేకానందనగర్, విరాట్‌నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా ఆయన వివేకానందనగర్‌లో రూ.25 లక్షలతో కమ్యూనిటీహాల్ భవనం పనులను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఉత్తుత్తి హామీల ప్రభుత్వం అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేర్చడం లేదని అన్నారు. పేద ప్రజలు పైసా పైసా కూడబెట్టుకొని ఇళ్లు కట్టుకున్నారని, ఇప్పుడు వాటిని కూల్చడం సరికాదని ఆయన అన్నారు. కార్యక్రమంలో షేక్‌పేట్ తహసీల్దార్ అనితారెడ్డి, నాయకులు ఎన్.దీపక్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జి.శివకుమార్, కీర్తిరెడ్డి, గంగరాజు, బల్దియా డిప్యూటీ కమిషనర్ కృష్ణ, జలమండలి డీజీఎం ప్రవీణ్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజల నుంచి ముఖాముఖిగా ఫిర్యాదులు స్వీకరించడానికే తాను ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి వచ్చిన వారి ఫిర్యాదులు తెలుసుకోని వారి వినతి పత్రాలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి తాను అధికారులు, మజ్లిస్ కార్పొరేటర్‌తో కలిసి బస్తీలలో పర్యటిస్తున్నానన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి సమస్యలు వారి దృష్టికి తెస్తున్నానని అన్నారు. అదే విధంగా ప్రజల వినతులు స్వీకరించడానికి నేరుగా వారిని కలవడం కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్‌లో వస్తున్న ఫిర్యాదులు వెంట వెంటనే పరిష్కరిస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పాత కుల వ్యవస్థ మళ్లీ తెరపైకి



మాట్లాడుతున్న సోషలిస్టు పార్టీ జాతీయ అధ్యక్షుడు థామస్

లక్డీకాపూల్: పాత కుల వ్యవస్థ మళ్లీ తెరపైకి వస్తుందని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ థంపాన్ థామస్ అన్నారు. గన్‌ఫౌండ్రీలోని జామియా నిజామియా కాంప్లెక్స్‌లోని మీడియా ప్లస్‌లో తెలంగాణ అధ్యక్షురాలు ఆర్. సుభద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికీ వెనుకబడిన, షెడ్యూల్డ్ కులాలు దోపిడీకి గురవుతున్నాయన్నారు. 83 శాతం యువత నిరుద్యోగులు, కార్మికులు బానిసలుగా మారారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ అయినా ప్రతి పరిస్థితిని తారుమారు చేయడానికి ఉపయోగించుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా కుల గుణన జరిపించి.. వెనుబడిన, షెడ్యూల్డ్ కులాలకు అర్హులైన వారికి రిజర్వేషన్లు కల్పించాలని థామస్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. గోపాల్ కృష్ణ, దక్షిణ ప్రాంత ఇన్‌చార్జి ఎస్.నూరుల్ అమిన్, ప్రధాన కార్యదర్శి ఈ.రాజేష్ పాల్గొన్నారు.

భారతీ సిమెంట్ ఫైవ్ స్టార్ గ్రేడ్ ఆవిష్కరణ



ఫైవ్ స్టార్ గ్రేడ్ సిమెంట్‌ను ఆవిష్కరిస్తున్న బద్రి తదితరులు

గోల్కొండ: భారతీ అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ఫైవ్ స్టార్ గ్రేడ్ మొదట్టమొదటిసారిగా ప్రవేశపెడుతున్నామని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి అన్నారు. శనివారం ఆయన షేక్‌పేట్‌లోని ఎస్వీ బిల్డింగ్ మెటీరియల్స్‌లో జరిగిన తాపీ మేస్త్రీల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అల్ట్రాఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ ఫైవ్ స్టార్ గ్రేడ్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ..ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగంగా పూర్తి అవుతుందన్నారు. ఈ సిమెంట్‌తో స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారులకు సరైన ఎంపిక అని అన్నారు. దీని కోసం తమ ఇంజినీర్లు సైటు వద్దకే వచ్చి సలహాలు, సూచనలు ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీ మార్కెటింగ్ డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ, తాపీ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కులగణన శాస్త్రీయ పద్ధతిలో జరగాలి



కార్యదర్శి అమిత్‌యాదవ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మన్నె శ్రీధర్

నాంపల్లి: ఎస్సీ, ఎస్టీ కులగణన శాస్త్రీయ పద్ధతిలో జరగాలని, ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నె శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం సంక్షేమ భవన్‌లోని షెడ్యూల్డ్ కులాల డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి అమిత్ యాదవ్‌ను కలిసి 19 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వినతిపత్రాన్ని కుల గణన కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్టింగ్ జడ్జికి పంపాలని కోరారు. ఈ సందర్భంగా మన్నె శ్రీధర్‌రావు మాట్లాడుతూ..కుల గణనలో మాల జాతి, అందులోని ఉప కులాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ నేతలు బల్వంతరావు, గోకుల కల్యాణ్, ఎస్.ప్రవీణ్ కుమార్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ

సౌత్ జోన్ అధ్యక్షుడిగా ఉమా శంకర్



ఉమా శంకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు ప్రొఫెసర్ ఎం.ఉమాశంకర్ ఇండియన్ సైక్రియాటిక్ సొసైటీ సౌత్ జోన్ అధ్యక్షుడిగా 2024-2025వ సంవత్సరానికి ఎన్నికయ్యారు. శనివారం బెంగళూరులో జరిగిన దక్షిణాది రాష్ట్రాల మానసిక వైద్యుల సంఘం సర్వసభ్య సమావేశంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉమాశంకర్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. ఉమాశంకర్ స్వస్థలం కరీంనగర్ జిల్లా యలగందల్. గాంధీ ఆసుపత్రిలో సైకియాట్రిక్ విభాగం హెచ్‌ఓడీగా, ఎర్రగడ్డ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్‌గా, స్టేట్ మెంటల్ హెల్త్ అథారిటీ సీఈఓగా సేవలందించారు. ఇటీవల జరిగిన మహేశ్వరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల సైకియాట్రిక్ విభాగం హెచ్‌ఓడీగా ఆయన బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

భిన్నత్వంలో ఏకత్వమే సృష్టి రహస్యం

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

చార్మినార్: భిన్నత్వంలో ఏకత్వమే సృష్టి రహస్యమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 27 వరకు కొనసాగనున్న ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శనివారం ప్రారంభించారు. సాలార్‌జంగ్ మ్యూజియంలోని ఈస్ట్ బ్లాక్ గ్యాలరీలో డైవర్స్ వాయిసెస్-ఆర్ట్ బియాండ్ బౌండరీస్ పేరుతో ఆర్ట్ వర్క్ ఆఫ్ న్యూరో డైవర్స్ అనే ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఆర్ట్ సాంక్చువరి సహకారంతో 100 వరకు ప్రత్యేకంగా రూపొందించిన చిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకరూపత ఏ రంగంలోనూ ఆమోదయోగ్యం కాదన్నారు. ఐక్యమత్యమే మహా బలమన్నారు. మేధోపరంగా సవాళ్లు ఎదుర్కొనే కళాకారుల ప్రతిభ తనను కదిలించిం దన్నారు. కళ అనుభూతికి చెందిన విషయమని.. వివరించేది కాదన్నారు. ఇక్కడి మ్యూజియంలో ప్రదర్శించిన కళాఖండాలు ప్రత్యేకమైన కళాకారుల్లోని దివ్య తేజస్సుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ ఆశిష్ గోయల్, ఆర్ట్ సాంక్చువరి వ్యవస్థాపక ట్రస్టీ శాలిని గుప్తా, ప్రముఖ గాయని దుర్గా జస్రాజ్, పద్మ అవార్డు గ్రహీత మహమ్మద్ అలీ బేగ్, బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శించిన కళాఖండాలు, వాటిని తయారు చేసిన వారి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు.

రేపు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా

విజయనగర్‌కాలనీ: ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈనెల 21న శాంతినగర్ ప్రభుత్వ ఐటీఐలో జాతీయ జాతీయ అప్రెంటీషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేటు పరిశ్రమలు, సంస్థల్లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఫొటోలు, సర్టిఫికెట్లతో సోమవారం ఉదయం 10 గంటలకు విజయనగర్‌కాలనీలో ఉన్న శాంతినగర్ ఐటీఐలో నేరుగా హాజరుకావాలన్నారు. ఇతర వివరాల ఐటీఐ కార్యాలయంలో సంప్రదించవచ్చు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో https://www.apprenticeshipindia.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చు.

మూసీ రివర్ ఫ్రంట్‌పై కేటీఆర్ డ్రామాలు ఆపాలి




గౌరీ సతీష్

అఫ్జల్‌గంజ్: మూసీ రివర్ ఫ్రంట్‌పై మాజీ మంత్రి కేటీఆర్ డ్రామాలు ఆపాలని టీపీసీసీ అధికారి ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను ప్రారంభించింది గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మూసీని సుందరీకరణం చేస్తామని ప్రకటించడంతో తట్టుకోలేని కేటీఆర్ వివిధ రకాల డ్రామాలను చేస్తూ ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారన్నారు. మూసీ సుందరీకరణతో హైదరాబాద్ ప్రపంచంలోనే నెంబర్:1 గుర్తింపు లభిస్తుందన్నారు. మూసీ అభివృద్ధి చేయడం ద్వారా మూసీ వెంట ఉండే లక్షలాది రైతులకు, స్థానిక ప్రజలకు నల్గొండ జిల్లా వరకు తాగునీరు ప్రవహించి వారికి ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. మూసీలో ఇళ్లు పోయినవారికి డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించి ఆర్థిక సహాయం కూడా అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన కేటీఆర్ ప్రజలకు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుత్రోవ పట్టించాలని సమావేశాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నాంపల్లి: విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్ల ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షుడు గాజుల నర్సయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శనివారం కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.ప్రేమ్‌కుమార్, కోశాధికారి ఇ.శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఇ.నవనీత రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు హెచ్.రాములుతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని సీఎం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ..రాష్ట్రంలో రెండు లక్షల 80 వేల పెన్షనర్లు ఉన్నట్లు వివరించారు. పెన్షనర్లకు సంబంధించిన అనేక సమస్యలు సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రధానంగా మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులు, ఐదు విడతల కరువు భత్యం, హెల్త్‌కార్డుల జారీ వంటి అంశాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 23న జరిగే మంత్రి మండలి సమావేశంలో కరువు భృతిని ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సన్మానం



కోదండరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

గౌలిపురా: తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండ రెడ్డిని శనివారం నాయకులు ఆయన కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మామిడి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్.బాలరాజు, బి.పృథ్వీరాజ్, వై.శ్రీనివాస్, ఎస్.బాలపుచాయ, కోట్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గోషామహల్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలి



ఈఈ రాధికతో సమావేశమైన ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో ఇంజినీరింగ్ విభాగంలో అభివృద్ధి పనులు, మరమ్మతులు చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అబిడ్స్ మున్సిపల్ కార్యాలయంలో 14వ సర్కిల్ నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమితులైన రాధికతో ఆయన సమావేశమై నియోజకవర్గంలోని జాంబాగ్, ఆగాపురా, పుత్లీబౌలి, దారుసలాం, ధూల్‌పేట్, మంగళ్‌హాట్, గౌలిగూడ, పురానాపూల్ తదితర ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, మురుగునీటి పైప్‌లైన్ల మరమ్మతులు, ఇతర ఇంజనీరింగ్ విభాగం పనులన్ని చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై గుంత ఏర్పడి కంకర్లు తేలినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ప్యాచ్‌వర్క్ వేయాలన్నారు. ఈ సందర్భంగా ఈఈ రాధిక సానుకూలంగా స్పందించారు. తన దృష్టికి సమస్యలన్ని ఇప్పుడే వచ్చాయని, వెంటనే ఏఈలు, డీఈలు పరిష్కారం చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో అహ్మద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులను అరికట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు

గౌలిపురా: తెలంగాణలో ఆలయాలపై జరుగుతున్న దాడులను వెంటనే ఆలపాలని వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి పగుడాకుల బాలస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిందూ ఆలయాలపై దాడులకు నిరసనగా వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లాల్‌దర్వాజా ఆలయం నుంచి లాల్‌దర్వాజా చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ..ఆలయాలపై దాడులు చేస్తున్న దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇస్లామిక్ తీవ్రవాదాన్ని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రికే హోంశాఖ ఉన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం పక్కన ఉన్న మసీదు ఉగ్రవాదులకు అడ్డాగా మారిందన్నారు. ఎందరో ఉగ్రవాదాలు విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా వచ్చి భాగ్యనగరంలో విధ్వంసానికి పాల్పడుతున్నా ఇక్కడి నిఘా వ్యవస్థ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు రేగు అనిల్, విశాల్, భాను, పవన్, అభిలాష్ కుమార్, హరి, రాహుల్, రాజు, అశ్విన్, సునీల్, దీపు పాల్గొన్నారు.

ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించండి



గడ్డం ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగదీశ్వర్, ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను వారు సన్మానించి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దీర్ఘకాలంగా లక్షలాది మంది ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి వారికి అండగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం ఉపాధ్యక్షులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, గడ్డం జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు

గోల్కొండ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. శనివారం మెహిదీపట్నంలోని వీర్ కన్వర్‌సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన రోడ్డు సేఫ్టీ సదస్సుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు ప్రమాదాల నివారణపై మిలట్రీ అధికారులు, జవాన్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిలట్రీ వారు ద్విచక్ర వాహనం నడిపే సమయంలో నిబంధనలను కచ్చితంగా పాటిస్తారని ఆయన అన్నారు. అయితే సివిలియన్స్ మాత్రం నిబంధనలను బేఖతారు చేస్తూ ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంగించే వారిపై జరిమానాలతో పాటు జైలు శిక్షలు కూడా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, వెంకటప్రసాద్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

గౌలిపురా: గౌలిపురాలోని సీబీఐ క్వార్టర్స్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం శారద విద్యాలయ (ఒకేషనల్ కోర్సు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నల్ల పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్ ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదర్ల మహేశ్ మాట్లాడుతూ..పేద ప్రజల సౌకర్యార్థం స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.కె.అలీ, విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి, రషీదా, కొడి సురేందర్, ఎ.దయానంద్, పి.రామ్‌మూర్తి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సపోర్టింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి



కోదండరాంకు వినతిపత్రం ఇస్తున్న సపోర్టింగ్ స్టాఫ్

సుల్తాన్‌బజార్: బస్తీ దవాఖానాలో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్ కు ఏజెన్సీ ద్వారా ఐదు నెలల పెండింగ్ వేతనాలు ఇప్పించాలని, వేతనాల పెరుగుదల అమలు చేయించాలని కోరుతూ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్తీ దవాఖానాల్లో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌కు పెండింగ్ వేతనాలతో పాటు బ్లడ్ సాంపిల్స్ రవాణా భత్యం, వ్యత్యాసం పేమెంట్ కూడా రావాల్సి ఉందని, అలాగే పూర్తి సర్వీస్ ప్రావిడెంట్ ఫండ్ జమ చేయుటకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ బస్తీ దవాఖానా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ అడ్వైజర్ ఆకుల శ్రీనివాస్, అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి అంజాద్ అలీఖాన్, ఉప్పలయ్య, శాంతమ్మ, స్వప్న, విజయ్, పద్మ కోరారు.

అవార్డుల ప్రదానం



అవార్డును అందుకుంటున్న దర్శకుడు కృష్ణయ్య

గన్‌ఫౌండ్రీ: ఇటీవల ఇండియన్ ఫిల్మ్‌మేకర్ అసోసియేషన్ నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్ ఆఫ్ ఒడిశా పోటీలలో కళారత్న కె.కృష్ణయ్య పలు అవార్డులను అందుకున్నారు. ఇట్లు మీ నాయన, తెలుగు షాట్స్‌ఫిల్మ్ చిత్రాలలో ఆయన నటకుగాను అవార్డులు దక్కాయి. శనివారం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం నుంచి తాను ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అసిమ ఖురేషి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్ప్రింగ్ ఫీల్డ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ అసిమ ఖురేషి అన్నారు. శనివారం ఎల్బీస్టేడియంలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ఐ ఉష్ చాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ విభాగాల్లో పది పతకాలను సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

రమణీయం.. రితిక నృత్యం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య శిక్షణాలయం కందుల కూచిపూడి నాట్యాలయం ఆధ్వర్యంలో నృత్య గురువు కూచిపూడి రవి శిష్యురాలు కంబలదిన్నె రితిక కూచిపూడి ఆరంగేట్రం శనివారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. భామ కలాపం, శివస్తుతి, నారాయణ తీర్థుల తరంగం, జావలి వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువులు వేదాంతం సత్యనారాయణసింహ శాస్త్రి, డాక్టర్ వెంకట సుబ్రమణ్యం భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

సంతోష్‌నగర్: వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. డీఎస్‌నగర్‌కు చెందిన కె.కృష్ణ కుమార్ (43) కాచిగూడలోని సీసీ ష్రఫ్ ఆసుపత్రిలో వార్డు బాయ్‌గా పని చేస్తున్నాడు. కృష్ణకుమార్ అప్పుడప్పుడు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి 10-15 రోజుల అనంతరం తిరిగి ఇంటికి వచ్చేవాడు. గత నెల 27న పని నిమిత్తం బయటికి వెళ్లిన కృష్ణ కుమార్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధూల్‌పేట్‌లో గంజాయి విక్రేతల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

అబిడ్స్: ధూల్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్టీఎఫ్ సూపరింటెండెంట్ నంద్యాల అంజిరెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 2.89 కేజీల గంజాయిని స్వాధీనపరచుకున్నారు. ధూల్‌పేట్ బడాబంగ్ల ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఇంటిపై దాడి చేసి 1.450 గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో పింట సింగ్, రచనబాయి, సంజన బాయిలను అరెస్టు చేయగా విజయబాయి పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ధూల్‌పేట్‌లోని మరో ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి 1.449 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కమలాబాయి, దివ్య సింగ్‌ను అరెస్టు చేయగా దుర్గాదేవి, నేహబాయి, సంగీత సాహు పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ దాడులలో ధూల్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు మదుబాబు, భాస్కర్‌గౌడ్, ఎస్ఐలు విష్ణుగౌడ్, ఉమామహేశ్వర్, మధు, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, సుధీర్, అజీం, రాకేష్, మహేష్, ప్రభు, రాహుల్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.